విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

జలకళతో రైతులకు నీరందేనా?

విశాలాంధ్ర-నూజివీడు : వైఎస్ఆర్ జలకళ..ఈ పథకం అమలుకు వేల కోట్లు ఖర్చు పెట్టనున్నట్లు ప్రచారం...పథకం ప్రారంభించి ఏళ్ళు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం శూన్యం. సన్న, చిన్నకారు రైతులకు సాగుకు నీరందించే కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొంటూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కార్యక్రమం వైఎస్ఆర్ జలకళ.ఈ పథకం ద్వారా రైతులకు సాగు భూములలో బోర్లు వేసి మోటారు అందించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం ద్వారా సాగు నీరు అందించే కార్యక్రమం తీసుకుంది.ఈ పథకం ప్రారంభించి రెండేళ్ళు దాటింది.దీనితో ఏలూరు జిల్లా పరిధిలో 6833 మంది రైతులు దరఖాస్తులు చేసుకోగా కేవలం 426 బోర్లు మాత్రం రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ పథకం ద్వారా 2.50 నుండి 4.50 ఎకరాలలోపు భూములు వున్న రైతులకు బోర్లను వేయనున్నట్లు ప్రకటించారు.రైతులు చేసుకున్న దరఖాస్తులను వివిధ శాఖల అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి పరిపాలన ఆమోదానికి పంపించాల్సి వుంది. ఆమోదం పొందిన బోర్లను తవ్వకం కోసం ఏజెన్సీలకు అప్పగించి ప్రతి నియోజకవర్గానికి ఒక డ్రిల్లింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలో వున్న నిబంధనలతో ఏజెన్సీలు వెనుకడుగు వేశాయి.6833 మంది దరఖాస్తు చేసుకోగా చివరకు 4157 మంది రైతులను అర్హులుగా గుర్తించి వారి కోసం రూ.122 కోట్లు అవసరం అవుతాయని ప్రతిపాదనలు పంపగా రూ.116 కోట్లకు పరిపాలనామోదం లభించింది. ఇప్పటి వరకు 1126 బోర్లను మాత్రం డ్రిల్లింగ్ చేశారు.దీని కోసం పరిపాలన ఆమోదం లభించిన మొత్తంలో పది శాతం మాత్రమే ఖర్చు చేశారు జిల్లా పరిధిలో అధికశాతం బోర్ల విషయంలో విద్యుత్ కనెక్షన్‌ల భారం రూ.10 కోట్లకు పైగా రైతులపై పడే పరిస్థితి నెలకొంది.రైతులకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడానికి విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన మొత్తం భరించడం సాధ్యం కాదని కొంత మేర మాత్రమే ప్రభుత్వం భరిస్తుందని తెలపడంతో తవ్విన బోర్లకు విద్యుత్ కనెక్షన్ మంజూరు ఇవ్వలేదు. దీంతో వైఎస్ఆర్ జలకళ రైతులకు అందుబాటు లోకి వచ్చేనా అని రైతులలో అనుమానాలు నెలకొన్నాయి.

ఆర్ఎస్‌ను పరామర్శించిన కోనాల భీమారావు

విశాలాంధ్ర - భీమవరం : సీపీఎం సీనియర్ నాయకులు,మాజీ శాసన సభ్యులు ఆర్.ఎస్.ను ఆదివారం భీమవరంలో ఆర్.ఎస్.నివాసంలో సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పుష్పకుమారితో కలిసి పరామర్శించారు. ఆర్.ఎస్. మాట్లాడుతూ తన వయస్సు 96 అని, ఆరోగ్యంగా ఉన్నానని, 100 సంవత్సరాలు పూర్తి చేస్తానన్న ఆత్మ విశ్వాసంతో ఉన్నానని పేర్కొన్నారు. భీమారావు మాట్లాడుతూ సీపీఐ ప.గో.జిల్లా కార్యదర్శిగా ఎన్నికై తణుకు నుంచి మకాం భీమవరం గునుపూడికి మారినట్టు తెలపగానే సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. గొప్ప కమ్యూనిస్టు ఉద్యమ నేత ఆర్.ఎస్‌తో మాట్లాడడం ఆనందంగా ఉందన్నారు.

నేడు స్పందన

విశాలాంధ్ర- ఏలూరు : ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం గంటల10 నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం ఉంటుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

వైసీపీ పాలన అవినీతిమయం

విశాలాంధ్ర - ఏలూరు : వైసీపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకు పోయిందని టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి రాధా కృష్ణయ్య (చంటి) విమర్శించారు. ఆదివారం 19వ డివిజన్ బూరాయిగూడెంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ రాష్ట్రాన్ని సమూలంగా దివాళా తీయించి తన ఖజానాను నింపుకున్న ముఖ్యమంత్రి జగన్ అవినీతి బయటపడే సమయం ఆసన్నమైందన్నారు. మద్యనిషేధం పేరుతో అబద్ధాలు వల్లె వేసి మద్యాన్ని వ్యాపా రంగా కోట్లాది నల్లధనాన్ని వెనకేసుకున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో అప్పులు, అరాచకాలు, ప్రజాధనం లూటీ, ప్రజాప్రతినిధుల సొంత ఆస్తులు పెంచుకోవడం తప్పా అభివృద్ధి జాడే లేదన్నారు. ఈ కార్యక్రమం లో డివిజన్ ఇన్‌చార్జి పైడి వెంకట్రావు, టీడీపీ 3వ డివిజన్ ఇన్‌చార్జి జాలా బాలాజీ, అంబటి రజనీ కుమార్, ఆలూరి రామయ్య, నున్న నిర్మల కుమారు, మత్తే సాయి, వాసూరి రాము, కొండపల్లి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

శివలింగ పాణి పటానికి వెండితో తాపడం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు భీమేశ్వర స్వామి దేవాలయంలో నూతనంగా శివలింగ పాణి పటానికి వెండితో తాపడం చేయించిన భక్తులు ఆదివారం స్వామి వారికి అలంకరించారు. స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితులతో పూజా కార్యక్రమం నిర్వహించి లక్ష బిల్వార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని తిలకరించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర- ముసునూరు:అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. ముసు నూరు మండలం అన్నపనేని వారిగూడెం గ్రామంలో 16 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం ఒక పూరి గుడిసెలో నిల్వచేసి అధిక రేటుకు తరలిస్తున్న విషయం పసిగట్టిన విజిలెన్సు అధికారులు(జిపిఏ)జిల్లా సమా చార పౌర సంబంధాల అధికారి వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఆతని పై సెక్షన్ 7(1) ,6ఏ కింద కేసు నమోదు చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తున్నట్లు తెలిపారు.

భారీ అన్నదానం

విశాలాంధ్ర-ముసునూరు: ముసునూరు మండలంలోని కోర్ల గుంట గ్రామంలో వేంచేసిన శ్రీ గుర్రలమ్మ, గుర్రలయ్య దేవతల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం సుమారు ఆరువేల మందికి భారీ అన్నదానం చేశారు.

నేటి నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - పోడూరు : మండలంలోని జిన్నూరులో శ్రీ సీతా రామరాజు విజ్ఞాన ప్రభా శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి 20 వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుపనున్నట్లు గ్రంథాలయ పాలకురాలు భత్తుల జోగారత్నం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడలు దండు కృష్ణంరాజులు తెలిపారు. తొలి రోజు గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి జాతీయ పతాకావిష్కరణ చేసి వారోత్సవాలు ప్రారంభిస్తా రన్నారు. కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు డిటిడిసి బాబు పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తారన్నారు. ఈ సందర్భంగా 7 రోజుల పాటు సీనియర్, జూనియర్ విద్యార్థులకు, మహిళలకు వివిధ విజ్ఞాన వినోద పోటీలు నిర్వహించడం జరుగు తుందని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సహాయ కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వర రావు తెలిపారు. విజేతలకు ఈనెల 20న బహుమతి ప్రదానం చేస్తారని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర-లింగపాలెం : లింగపాలెం మండలం సుందరరాజుపేటకు చెందిన కె. థామస్ (49) చింతలపూడి మండలం ఫాతిమాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొన్నట్లు స్థానికుల కథనం. ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

విశాలాంధ్ర - ఏలూరు : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఎస్ సి,ఎస్ టి,బిసి, జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉండవల్లి లోని లోకేష్ క్యాంపు కార్యా లయంలో ఆదివారం ప్రతినిధి బృందం కలిసి జర్నలిస్టుల సమస్యలపై విజ్ఞాపన పత్రం అంద జేసింది. అనంతరం లోకేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం అన్నారు. అధికారం లోకి వచ్చిన తరువాత జర్నలిస్టుల సమస్యలపై సముచిత నిర్ణయం తీసుకొని న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత వైద్యం, జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య, తదితర సమస్యలపై ఒక నివేదిక తయారు చేస్తుందన్నారు. భవిష్యత్తులో జర్నలిస్టులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రతినిధి బృందంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొండేటి ఆనంద్, సేన స్టాఫ్ రిపోర్టర్ జాలా బాలాజీ, విశాలాంధ్ర ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో బెజవాడ బ్రహ్మయ్య, అక్షరం రిపోర్టర్ సాధనాల మునీశ్వరరావు (నాని) జిల్లాల ప్రతినిధులు ఉన్నారు.

కూలిన వంతెన.. మరమ్మతు ఎప్పుడు ?

విశాలాంధ్ర - లింగపాలెం : ఆశన్న గూడెంలోని గుండేరు వాగుపై ఉన్న వంతెన కూలినా మరమ్మతులు చేయకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఇది కూలి రోజులు గడుస్తున్నా అధికారుల్లో ఏ మాత్రం చలనంలేనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. నిత్యం రద్దీగా వాహనాలు తిరిగే ఈ మార్గంలో ప్రయాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. కనీసం ద్విచక్ర వాహనం వెళ్ళేందుకు కూడా వీలులేకుండా ఉంది. పది గ్రామాలలోని వందలాది మంది ప్రయాణించ టానికి ఈ మార్గంలోని ఈ వంతెన ఆధారం. ఇప్పుడు ఇది కూలిపోవ టంతో మూడు, నాలుగు కిలోమీటర్ల ప్రయాణానికి 30 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తుంది. వ్యవసాయ భూముల్లోకి ట్రాక్టర్లు, ఎడ్ల బళ్ళు వెళ్ళే వీలు లేకుండా ఉంది. ప్రతీరోజు స్కూళ్ళకు వెళ్ళే విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఎన్ని ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోకపోవటం పట్ల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనసేన నాయకులను అడ్డుకున్న జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

విశాలాంధ్ర- పెంటపాడు : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జగ నన్న ఇల్లు పేదలకు కన్నీళ్లు పేరిట పెంటపాడు మండలం జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని దర్శిపర్రు బిల్లగుంట కాలనీలో జగనన్న కాలనీ లను పరిశీలించేందుకు వెళ్లగా చేదు అనుభవం ఎగిరింది. గో బ్యాక్ జనసేన అంటూ లబ్ధిదారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇళ్ల స్థలాలు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరు చేశారని తెలిపారు. దర్శపర్రు గ్రామపంచాయతీకి సంబంధించి నాలుగు ఎకరాలు కొని ఇల్లు నిర్మించి ఇచ్చారని మేమంతా సంతోషంగా ఉన్నామని లబ్ధిదారులు తెలిపారు. జనసేన నాయకులు కేవలం ఓటు బ్యాంకింగ్ కోసం నీచపు రాజకీయాలు చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు అన్నారు.

ప్రాథమిక అవసరాలు తీర్చలేని ప్రభుత్వం

విశాలాంధ్ర -నూజివీడు : ప్రాథమిక అవసరాలు కూడా తీర్చలేని ప్రభుత్వం ఉండడం శోచనీయమని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు పట్టణంలోని రెండో వార్డు కొప్పుల వెలమపేటలో మన ఇంటికి మన ముద్దరబోయిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రజా అవసరాలను తెలుసుకొని వాటిని పూర్తి చేశానని జగన్ రెడ్డి చెప్తుంటే క్షేత్రస్థాయిలో మాత్రం డ్రైనేజీలు లేక పారిశుద్ధ్యం అధ్వానంగా మారి వీధిలైట్లు వెలగక డివిజన్ కేంద్రమే మారుమూల ప్రాంతాలుగా మారిపోతున్నాయని ఆయన అన్నారు. నూజివీడు పట్టణంలో ఉన్నామా లేక శివారు గ్రామీణ ప్రాంతాలలో ఉన్నామా తెలియడంలేదని అదేమంటే స్థానిక ప్రతినిధులు మాతోనే అభివృద్ధి మేమే అభివృద్ధి చేశామని చెప్పుకుంటారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్,నూజివీడు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, నూజివీడు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముసునూరు రాజా, నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు యనమదల సత్యనారాయణ (నాని), పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలిశెట్టి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

విశాలాంధ్ర -భీమవరం: యాళ్లబండి పోలిశెట్టి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగా రావు అన్నారు. యాళ్లబండి 39వ వర్ధంతిని ఆదివారం నౌడూరు, వేంద్ర గ్రామాల్లో సీపీఐ శ్రేణులు నిర్వహించి నివాళులర్పించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆయన కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారని జిల్లాలో ఎస్ఎఫ్, వైఎఫ్ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. కమ్యూనిస్టు పార్టీ పై నిషేధం విధించిన రోజుల్లో ఆయన అగ్ర నాయకత్వానికి కొరియర్ గా వ్యవహరించారని గుర్తుచేశారు. దళిత వర్ణాలకు హిందూ దేవాలయాల్లో ప్రవేశానికి ఆయన పెద్ద ఉద్యమమే నడిపి విజయం సాధించారని కొనియాడారు. కాళీపట్నం జమిందారీ భూపోరాటాల్లోను, సిఎండి, లోసరి-గూట్లపాడు భూ ఉద్యమాల్లోనూ అసెంబ్లీ టైగర్ వంక సత్యం, నాగిడి సాంబమూర్తి, నెక్కంటి సుబ్బారావు, కడలి గంగిశెట్టి తదితర నాయకులతో కలిసి పనిచేశారన్నారు. గీత కార్మిక సహకార సంఘం నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు కడలి గంగిశెట్టి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.లక్ష్మీపతి, యాళ్లబండి కుమారుడు రవీంద్రనాథ్ ఠాగూర్, గ్రామ కార్యదర్శి ఎల్.సత్యనారాయణ, నాగిరెడ్డి నారాయణ, కడలి సత్యనారాయణ, పాలా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రాజనందిని

విశాలాంధ్ర - ఏలూరు : గని వేద రాజనందిని తన 3వ ఏట నుండి సంగీతం, 5వ ఏట నుండి కరాటే యుద్ధ విద్య అభ్యసించడం ప్రారంభించి అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక పతకాలను సాధిం చింది. చిత్రలేఖనంలో కూడా ప్రావీణ్యం సంపా దించడంతో పాటు అనేక బహుమతులు గెలుచుకుంది. గత నెలలో జరిగిన జాతీయ స్థాయి కరాటే విద్యలో కటా విభాగం నందు కాంస్య పతకం, కుంతే విభాగం నందు బంగారు పతకం సాధించింది. ప్రస్తుతం సెయింట్ థెరీసా బాలికోన్నత పాఠశాల నందు 8వ తరగతి చదువుతున్న రాజనందిని ఆల్ రౌండర్ గా గుర్తింపు పొందింది. తన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే తాను అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లుగా రాజనందిని తెలిపింది. రాజనందిని సంగీత ప్రతిభను గుర్తించి 75 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో గిటార్ తో వందేమాతరం గీతం ఆలపించే అవకాశం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కల్పించి ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఈ రహదారిలో ప్రయాణం ఎలా ?

విశాలాంధ్ర-కైకలూరు : వర్షాలు ఆగిపోయి ఎన్ని రోజులైనా కైకలూరు నుండి కలిదిండి వెళ్లే ప్రధాన రహదారి ఇప్పటికీ రోడ్లు చెరువుల్లా ఉన్నా యని అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే జయ మంగళ వెంకట రమణ అన్నారు. ఆదివారం కైకలూరు నుండి కలిదిండి వెళ్ళే మార్గంలో వరహాపట్టణ శివారు ఆర్అండ్‌బి రోడ్డు ను పరిశీలించారు.ఈ సందర్భంగా జయమంగళ వెంకట రమణ మాట్లాడుతూ వర్షాలు ప డి నెల రోజులు గడుస్తున్నా అధికారుల నుండి ఈ రోడ్లపై ఎలాంటి స్పందన లేకుండా ఉన్నారని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో వేసిన రోడ్లపై వారు తిరుగుతూ వారు ఏదో అభివృద్ధి చేశామని చెప్పుకుంటూ గడపగడపకు మన ప్రభుత్వం అని తిరుగుతున్నారని అన్నారు. కైకలూరు నియోజకవర్గం లోని ప్రధాన రహదారులన్నీ తక్షణమే అభివృద్ధి డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భలే యేసు రాజు, వడ్డీ సాధికార కమిటీ చైర్మన్ ,మాజీ సర్పంచ్ జయమంగళ సుబ్బరాజు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

విశాలాంధ్ర- కలిదిండి: కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి. రమణారావు అన్నారు. ఆదివారం కలిదిండి బస్టాండ్ వద్ద మండల భవన నిర్మాణ కార్మికులు సిఐటి యు అనుబంధ సంఘం మండల కమిటీ సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడున్నర ఏళ్ల కాలంలో నిర్మాణ కార్మికులకి చేసింది ఏమీ చేయలేదని, కార్మికులకు ఉన్న సంక్షేమ బోర్డు నిధులను రూ 1250 కోట్లు దారి మళ్లించి ప్రభుత్వ అవసరాలకు వాడుకుందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా అప్పటి చంద్రన్న బీమా పథకాన్ని వ్యతిరేకిస్తూ నిర్మాణ కార్మికులు న్యాయం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలు చేయకుండా 12 14 మెమో జారీ చేసి కార్మికులను మోసం చేసిందని అన్నారు. కార్మిక హక్కులు చట్టాలు సాధించడం కోసం పోరాటాలే మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో కటికల శ్రీను, పరసా రాజేష్. పోతురాజు, బాలాజీ, అబ్దుల్ అక్బర్, సుంకర హరి, బత్తిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ కేవైసీ వేగవంతంగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి ఈ కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి .ప్రశాంతి ఆదేశించారు.ఆయుష్మాన్ భారత్ పథకం జాతీయ ఆరోగ్య రక్షణ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఈ పథకం పేదలకు లబ్ధి చేకూరేలా జాతీయ బీమా కింద లబ్ధి పొందేందుకు అవకాశం ఉందని కలెక్టర్ అన్నారు. ఈ పథకం ద్వారా ఆరోగ్య భీమా వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇతర రాష్ట్రాల్లో కూడా వైద్యం చేయించుకోవడానికి ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి జిల్లాలో 7,42,629 మంది లబ్ధిదారులు ఉండగా అందులో ఇప్పటివరకు 2,47,162 మందికి మాత్రమే ఈ కేవైసీ పూర్తి చేశారని ఇంకా చేయించాల్సిన 4,95,467 మంది ఉన్నారని వీరికి త్వరితగతిన ఈ కేవైసీ పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ ఆయుష్మాన్ భారత్ కార్డులు పేద వారికి వైద్యం చేయించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ అన్నారు.

నూజివీడు డీఎస్పీగా అశోక్ కుమార్ గౌడ్

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : నూజివీడు సబ్ డివిజన్ డీఎస్పీగా అశోక్ కుమార్ గౌడ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. డివిజన్ పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తామని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, డిఎస్పిని మర్యాదపూర్వకంగా కలిసారు.

తెలుగు యువత మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఉండి : ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు (కలవపూడి రాంబాబు) జన్మదినో త్సవ వేడుకలు సందర్భంగా ఉండి నియోజకవర్గ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాంపల్లి వెంకట్, ఉండి అధ్యక్షులు చెన్నం శెట్టి హరి నాయుడు, కార్యదర్శి కోళ్ల నాగబాబు, నాయకులు పసల వెంకటాచలం ఆధ్వర్యంలో కోట్ల ఫంక్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.తెలుగు యువత సేవా కార్యక్రమాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు. ఈ రక్తదాన శిబిరంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు ఈ రక్తదాన పాల్గొని రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కరిమెరక నాగరాజు, క్లస్టర్ ఇంచార్జి కట్ట రాంబాబు, కాళ్ల మండల పార్టీ అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు, జిల్లా ఐటీడీపీ అధ్యక్షులు యశోద కృష్ణ, మంతెన సాయిలచ్చిరాజు, కిన్నెర వెంకన్న, దూసనపూడి రాంబాబు, ముదునూరు కృష్ణంరాజు, కాగిత మహంకాళి, కరిమెరక శ్రీనివాస్, పాలపర్తి బాలాజీ, బాబి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

విశాలాంధ్ర - కుక్కునూరు : మండలంలో రాంసింగారం గ్రామంలో ఎస్ఇబి అధికారులు తనిఖీ నిర్వహిస్తుండగా రాంసింగారం గ్రామానికి చెందిన సరియం ముత్యాలు అనే వ్యక్తి వద్ద 5 లీటర్ల నాటు సారా ఉండటంతో అతనిని అదుపులోకి తీసుకుని సారా స్వాధీనం చేసుకుని కుక్కునూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఇబి సిఐ ప్రసాద్ కుమార్ తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర -కలిదిండి : 55వ జాతీయగ్రంథాలయ వారోత్సవా లను పాఠకులు, విద్యార్థులు జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని పడమటిపాలెంలో కలిదిండి శాఖ గ్రంథాలయ అధికారి రమేష్ ఆధ్వర్యంలో వారోత్సవాల గోడ పత్రికను డిఎన్ఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారం అన్నారు. మానవ మేధస్సును వికసింపచేసేవి గ్రంథాలయాలని అన్నారు. ఈ నెల 14 నుండి 20 వరకు జరిగే ఈ వారోత్సవాలలో అనేక అంశాలపై అవగాహనా సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన. ఉమా మహేశ్వరరావు, జడ్పీటీసీ బొర్రా. సత్యవతి, వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గా రాణి, ఏఎంసి చైర్మన్ బ్రాహ్మజీ, వైస్ చైర్మన్ పాము రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న పాత సామాగ్రి బహిరంగ వేలం

విశాలాంధ్ర - చింతలపూడి రూరల్ : ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బాలికలు) నాగిరెడ్డి గూడెంకు చెందిన పాఠశాలలో పాత సామాగ్రి ఈనెల 18వ తేదీన బహిరంగ వేలం వేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం సురేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఇనుము, చెక్క సామాగ్రి, అల్యూమినియం, స్టీల్, విద్యుత్, ఎలక్ట్రానిక్, పాత ఆట వస్తువులు, పాత పాఠ్య పుస్తకాలు, జవాబు పత్రాలు, వార్తాపత్రికలు కమిటీ ఆధ్వర్యంలో వేలం వేస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు గుర్తింపు పత్రాలతో వచ్చి గురుకుల పాఠశాల నాగిరెడ్డి గూడెం పేరుతో భారతీయ స్టేట్ బ్యాంక్ చింతలపూడిలో చెల్లే విధంగా రూ.5వేల డిడి రూపంలో ధరావత్తు చెల్లించిన తర్వాత వేలంపాటలో పాల్గొనా లన్నారు. ఇతర వివరాలకు 9959666156 నంబరును సంప్రదించాలని కోరారు.

కాపులు ఐక్యంగా ఉండాలి

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : కాపు సామాజికవర్గానికి చెందిన వారంతా ఏ రంగంలో ఉన్నా ఐకమత్యంతో మెలిగినట్లయితే అందరూ అభి వృద్ధిలో ముందుకు వెళ్లవచ్చని కాపు సంఘ నాయకులు అన్నారు. ఆది వారం మండల కాపు సంఘం ఆధ్వర్యంలో జీలుగుమిల్లి గ్రామంలో నిర్వహించిన కాపు వనసమారాధన కార్యక్రమంలో నియోజకవర్గ,డివిజన్ స్థాయి కాపుసంఘం నాయకులు, పెద్దలు వనసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాపుసంఘం అధ్యక్షులు యడ్లపల్లి శేషగిరి ఆధ్వర్యంలో కాపు సామాజిక వర్గానికి చెందిన వారు తమ కుటుంబాలతో హాజరై ఉదయం నుండి ఆటలు,పాటలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ఉల్లాసంగా గడిపారు.అనంతరం జరిగిన కార్యక్రమం కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ మనమంతా ఒకరికొకరు సహాయపడుతూ,కలిసి సేవా కార్యక్రమాలు చేస్తూ అభివృద్ధికి పాటుబడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డి.సి.సి.బి చైర్మన్ కరాటం రాంబాబు,రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాధరావు, జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోలనాటి బాబ్జి,దర్భగూడెం సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు,జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము,కాపు సంఘం నాయకులు సింగులూరి కృష్ణమూర్తి, కోలా ధర్మరాజు,గంగుల రమేష్, పసుపులేటి ప్రసాద్,రూపా సత్యనారాయణ,కొర్ల సత్యనారాయణ,శాఖమూరి సాయి, సూరిశెట్టి ఏసు, సూరిశెట్టి మహేష్, కాపు యువత పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర - కలిదిండి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ పేద, మధ్యతరగతి వర్గాల జీవితా లకు ఆర్థిక భరోసాను ముఖ్య మంత్రి జగనన్న అందిస్తున్నారని ఆయన పట్ల ప్రజాభిమానం స్పష్టంగా కనిపిస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని పడమటిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో ఆయన అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమాన్ని పరుగులెత్తిస్తున్న జగనన్న,అభివృద్ధిపైనా దృష్టి నిలిపి నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు రూపురేఖలు మార్చడమే కాకుండా ప్రతి సచివాలయ పరిధిలో కార్పొరేట్ తరహా ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొర్రా. సత్యవతి, ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ నంబూరి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలి

విశాలాంధ్ర - భీమడోలు : భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టరు పోస్టింగ్ చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆదివారం సిపిఎం ప్రతినిధి బృందం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సర్వే చేసింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు లింగరాజు మాట్లాడుతూ అవసరమైన మందులు లేక,డాక్టర్ల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బిల్డింగ్ లు కట్టడం మీద ఉన్న శ్రద్ధ ఆసుపత్రిలో డాక్టర్లు,మందులు,పరికరాలు, సౌకర్యాలపై ఉండాలని వారు హితవు పలికారు.ఆసుపత్రిలో సుగర్ టెస్ట్ లు చేసే కిట్లు లేక సుగర్ పరీక్షలు చేయడం లేదని, కళ్లద్దాలు గత రెండు నెలలుగా సరఫరా ఆగిపోయిందన్నారు. బి.పి, సుగర్, గుండె జబ్బులకు మందుల కొరత వేధిస్తోందన్నారు.అన్ని సేవలు ప్రైవేటుపరం చేసిన ఫలితంగా వారికి సకాలంలో ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదని,దానితో ప్రవేటు సేవలన్నీ ఆగిపోతున్నా యన్నారు.తక్షణమే అన్ని రకాల మందులు సరఫరా చేయాలని,డాక్టర్ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సర్వేలో సిపిఎం నేతలు వై. సాల్మన్ రాజు,కట్టా భాస్కరరావు, ఎం.పానకాలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలు జనసేన పరిశీలన

విశాలాంధ్ర-భీమడోలు: జగనన్న ఇళ్ల కాలనీలు ప్రజలందరికీ కన్నీళ్లు తెప్పిస్తున్నాయని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు విమర్శించారు. జనసేన సామాజిక పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండల అంబరుపేట గ్రామ పంచాయతీ పరిధిలోజగనన్న కాలనీల పేరిట పేదలకు జరిగిన మోసాన్ని ,అక్రమాలను పరిశీలించి లబ్ధిదారులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ సుమారు 6 ఎకరాలలో అంబరుపెట, కురెళ్ళగూడెం, వడ్లపట్ల 3 గ్రామాల ప్రజలకు 235 లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలు అందచేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ స్థలాలు గ్రావెల్ క్వారీలలో ఇవ్వడం వలన ఈ కాలనీలో లబ్ధిదారుల ఇళ్లు కట్టడానికి సుమారు రూ. 50వేల నుండి 1 లక్ష వరకు ఖర్చుపెట్టి స్థలాన్ని పూడ్చుకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలాల చెరువులను తలపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళలు అంబటి మాధవి ,భీమడోలు మండల నాయకులు పత్తి మదన్,తాటిమళ్ల రామ్మూర్తి,తెల్లం శివశంకర్ పునునూరి సురేంద్ర, నిమ్మకాయల గణ, దౌవులూరి సునీల్ పాశం సురేంద్ర శరత్ గోలిమే, శ్రీహరి, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో : జగనన్న ఇళ్లు పేదలందరికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయని జనసేన పార్టీ తణుకు నియోజకవర్గం ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు విమర్శించారు. నియోజకవర్గంలోని జగనన్న కాలనీ లలో జగన్ ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విడివాడ రామచంద్రరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిన చోట కనీస మౌలిక సదుపాయాలు రోడ్లు, డ్రైనేజీ, త్రాగు నీరు, విద్యుత్ వంటివి ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇసుక, సిమెంట్, కంకర, ఐరన్ వంటివి రవాణాకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తణుకు మండలం అధ్యక్షులు చిక్కాలవేణు, ఇరగవరం మండల అధ్యక్షులు ఆకేటి కాశీ తదితరులు ఉన్నారు.

ఉంగుటూరులో : ఉంగుటూరు మండలం పందిరెడ్డిగూడెం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జగనన్న ఇల్లు పేదలకు కన్నీళ్లు అంటూ నిరసన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జిజ ధర్మరాజు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలకు శ్మశాన భూమిని కేటాయించారన్నారు. దీని వల్ల లబ్ధిదారులు ఇల్లు నిర్మించు కోవడానికి వెనుకంజ వేస్తున్నారని, పేదల పట్ల పక్షపాతం చూపిస్తున్న ప్రభుత్వాన్ని దుయబట్టారు. జనసేన వీర మహిళలు అంబటి మాధవి గారు, ఉంగుటూరు మండల నాయకులు సూరత్తు అయ్యప్ప ఇల్లిందుల సురేష్, గౌతు రాజేష్ , గోపాలపురం గ్రామ అధ్యక్షులు జి. వెంకటేష్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలలో రహదారులు నిర్మించండి

విశాలాంధ్ర - దేవరపల్లి : జగనన్న కాలనీలలో రహదారులు నిర్మించాలని జనసేన గోపాలపురం నియోజకవర్గ నాయకులు డి. సువర్ణ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరపల్లి మండలం కృష్ణం పాలెం దోమంతన గూడెం గ్రామాల్లో జనసేన పార్టీ నాయకులు జగనన్న కాలనీలో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ ఇక్కడ కేటాయించిన స్థలాల్లో వర్షం వస్తే ముంపు బారిన పడుతుందన్నారు. కనీసం రోడ్లు కూడా లేవని చెప్తున్నారన్నారు. ఇల్లు కట్టుకోవడానికి ఇక్కడ ఏమాత్రం నివాసయోగ్యంగా లేవన్నారు. స్థలాలు కేటాయించి రెండు సంవత్సరాలు అవుతున్న ప్పటికీ రహదారి సౌకర్యం లేదని విమర్శించారు.

తక్షణమే మౌలిక సదు పాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి దుర్గాప్రసాద్ నాయుడు, దేవరపల్లి మండలం జనసేన పార్టీ అధ్యక్షులు కాటన్ గణేష్, జనసేన పార్టీ నాయకులు సప్పటి శివ నాగ ప్రసాద్, పి ప్రసాద్, పి నాని, జీకే నాని, కే సత్తిబాబు, నరసింహ, నాయకులు జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా వర్తక సంఘం వన సమారాధన

విశాలాంధ్ర - గణపవరం: ది గణపవరం బువ్వనపల్లి సరిపల్లె కిరాణా అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక సమారాధన కార్యక్రమం ఆదివారం గణపవరం ఇందిరమ్మ కాలనీలో జరిగినది .ఈ కార్యక్రమంలో వర్తకులు ,గుమస్తాలు పాల్గొన్నారు. వీరితోపాటు పాత్రికేయులను కూడా ఆహ్వానించి సన్మానించారు. వర్తక సంఘంలో విశేషమైనటువంటి సేవలు చేసిన వారిని గుర్తించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ బి. మాల్యాద్రి యాదవ్ ,సెక్రటరీ శేగు సుబ్రహ్మణ్యం, కోశాధికారి జువ్వల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఉప్పల కాశి, ఇందుగల మురళి, కార్తీక వన సమారాధన చైర్మన్ మిరియాల వెంకట సుబ్బారావు, రమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల వనభోజనాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు భద్రకాళి మందిరం ఆలయంలో ఆదివారం చేనేత కార్మికుల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు వైభవంగా నిర్వహించారు. తొలుత చేనేత కార్మికులు ఉసిరి చెట్టుకి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం కార్తీక వనభోజన కార్యక్రమాల్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంఘం గౌరవ సలహాదారుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, బండారు నాగరాజు, ఏ ఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, మాజీ దేవస్థానం చైర్మన్ దూసనపూడి లక్ష్మీనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఆటల పాటలతో కార్తీక వనభోజనాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

క్షత్రియ వన సమారాధనలో ప్రభుత్వ చీఫ్ విప్

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు పట్టణం క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన సమారాధన మహోత్సవంలో నర్సాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం అల్లూరి సీతారామరాజు ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. పలువురు వైసిపి ముఖ్య నేతలతో పాటు క్షత్రియ సంక్షేమ పరిషత్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం వన సమారాధన

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన సమారాధన లో భాగంగా కార్తీక మాసం విశిష్టత తెలుపుతూ ఉసిరి చెట్టుకి పూజా రమ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ముత్తన పెద్ది హరికృష్ణ పంతులు ఆధ్వర్యంలో రమా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. మతంశెట్టి కిషోర్ కుమార్ గీత, చిట్లూరు సూర్యనారాయణ సుమ, మద్దుల వాసు మహాలక్ష్మి దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అనంతరం 700 మందికి భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్య సంఘం మండల అధ్యక్షులు కొనకళ్ళ వెంకన్న, సాధు చెన్నారావు ,చిత్త పూడి పవన్ కుమార్, కక్కరాల చక్రి, కోరుకొండ రామకృష్ణ, రేపాక సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నివాస యోగ్యం కాని జగనన్న ఇళ్ల స్థలాలు

విశాలాంధ్ర - సీతానగరం : పేద ప్రజలకు నివాస యోగ్యం కానివే జగనన్న ఇళ్ల స్థలాలు అని రాజానగరం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి మేడ గురుదత్త ప్రసాద్ అన్నారు. మండలంలో ఆదివారం గురుదత్త ప్రసాద్ జనసేన నాయకులు, జన సైనికులతో కలిపి సీతానగరం మండలంలో వంగలపూడి, సింగవరం చినకొండేపూడి, నాగంపల్లి కూన వరం, రఘుదేవపురం గ్రామాల పేద ప్రజలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గురుదత్త ప్రసాద్ మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల స్థలాల కేటాయింపులో పేద ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎక్కడ కూడా నివాస యోగ్యం కాని ఇళ్ల స్థలాలు కేటాయించి పేద ప్రజల కన్నీలకు కారణం అయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్ శంకర్, కో కన్వీనర్ కత్తి సత్యనారాయణ, వి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతికై సత్యసాయి ప్రపంచ వ్యాప్త అఖండ నామ సంకీర్తన

విశాలాంధ్ర - రావులపాలెం : విశ్వశాంతికై భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ప్రపంచ వ్యాప్త అఖండ నామ సంకీర్తన శనివారం సాయంత్రం స్థానిక సత్యసాయి అష్టాదళ సేవా పుష్పం (సేవా కేంద్రం)లో ప్రారంభమైంది. ప్రముఖ వైద్యులు డాక్టర్ కర్రి బలరామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి అఖండ నామ సంకీర్తన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సత్యసాయి సేవాకేంద్రం చైర్మన్ కొవ్వూరి వివేకానందరెడ్డి మాట్లాడుతూ శనివారం సాయంత్రం 6 గంటల నుండి ఆదివారం సాయంత్రం 6-00గంటల వరకు విశ్వశాంతికై ప్రపంచ వ్యాప్తంగా అఖండ నామ సంకీర్తన (24 గంటల భజన) జరుగుతుందన్నారు. ఈ నెల 23వ తేదీన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 97వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సమస్తలోక కల్యాణార్థం ఆదివారం ఉదయం సహస్ర సాయి గాయిత్రి హోమ యజ్ఞం, బ్రహ్మశ్రీ ఈమని సత్తిబాబుశర్మ బ్రహ్మత్వంలో నిర్వహించారు.సాయంత్రం 6 గంటలకు ప్రపంచవ్యాప్తంగా ఒకే సమయానికి మహా మంగళహారతితో నామ సంకీర్తన ముగియనుంది. అనంతరం కార్తీక సమారాధన బాబా వారి దివ్య ప్రసాదం పంపిణీకి జరుగుతుందని వివేకానంద రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్యం పర్వత వర్ధనరావు, కొవ్వూరి సత్యం, యన్‌వియస్ రెడ్డి, నడింపల్లి రామకృష్ణంరాజు, ఒంటెద్దు బంగారయ్య, మేడపాటి విజయభాస్కర్ రెడ్డి, కొవ్వూరి బ్రహ్మరెడ్డి, పెరవలి వెంకటేశ్వరరావు, చింతలపూడి రామభద్రరావు, కొవ్వూరి విజయ్ అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం కార్తీకవన సమారాధన

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి మండలం శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కిర్లంపూడి కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెంత ఉన్న, జగ్గంపేట నియోజకవర్గం బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు ఎస్ఎస్ రామ్ కుమార్ స్వగృహంలో నిర్వహించిన ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమానికి మండలంలోని పలు బ్రాహ్మణ కుటుంబాలు పాల్గొన్నాయి. తొలుత పాఠశాల ఆవరణలో ఉన్న పాఠశాల స్థలదాత కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ రాంకుమార్, బాదంపూడి సూర్యనారాయణమూర్తి, తదితరులు మాట్లాడుతూ కొక్కొండ రామశాస్త్రరావు పంతులు అప్పట్లో పాఠశాలకు 11 ఎకరాల భూమిని దానం చేయడమే కాకుండా ఎంతోమంది పేద విద్యార్థులకు ఫీజులు కట్టి చదివించిన ఘనత ఆయనకే దక్కుతుంద న్నారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండలం శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి సత్యనారాయణ, జగ్గంపేట నియోజకవర్గం బ్రాహ్మణ సంఘం నాయకులు భూపాలపట్నం ప్రసాద్, తోపాటు ఓలేటి రాజు, డాక్టర్ ఎం తిరువెంగళాచార్యులు, దాతారం నాగ శేషగిరిరావు, సముద్రం రామారావు, వర్జుల రమణ, ఆరాధ్యుల వెంకన్న బాబు,హనుమంతవజ్జుల చలమేశ్వర శర్మ, బ్యాంకు రాంబాబు, నీలయ శాస్త్రి, పంచాగ్ని శుభాకర్ రావు, ఎల్ఐసి ప్రసాద్, మండలంలోని పలు బ్రాహ్మణ కుటుంబాలు పాల్గొన్నాయి.

విప్లవ గేయాల గాత్రం మూగబోయింది

ప్రజా కళాకారులు అడ్డాడ నాగేశ్వరరావు కన్నుమూత

విశాలాంధ్ర - చల్లపల్లి :విప్లవ గేయాల గాత్రం మూగబోయింది.ప్రజా కళాకారులు, ప్రజా నాట్యమండలి నాయకులు, భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు,విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు(80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురై వక్కలగడ్డలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసినఆయన రచయితగా, కళాకారునిగా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, ప్రజా నాట్యమండలి నాయకుడిగా విశేష గుర్తింపు పొందారు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలలో క్రియాశీలకంగా పనిచేసి తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసేవారు. కమ్యూనిస్టు పార్టీ తలపెట్టిన ప్రతి ఉద్యమంలోనూ ముందుండి నడిచేవారు. సాంఘిక నాటకాలకు దర్శకత్వం వహించి స్వయంగా నటించారు. పౌరాణిక నాటకాల ఆర్గనైజర్ గా, మేకప్ మెన్ గా ఎంతో ఖ్యాతిని ఆర్జించారు. ప్రజానాట్యమండలి ద్వారా ఎందరో శిష్యు లను సమాజానికి అందించారు. వక్కలగడ్డ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు అడ్డాడ నాగేశ్వరరావు తండ్రి అడ్డాడ కోటేశ్వరరావు క్రియాశీలక భూమికను పోషించారు. తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న ఆయన అదే పందాను కొనసాగించారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, ప్రజానాట్యమండలి నాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘ నేతగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం,ప్రతిష్టా మహోత్సవాలు, ఆలయ అభివృద్ధిలో ముఖ్య భూమిక వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు అనేక ప్రాయోజిత నాటకాలను రూపొందించి గ్రామాల్లో ప్రదర్శించారు.

ప్రజా నాట్యమండలి అధ్యక్షులు అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు పోతరాజు నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, సీపీఐ నేతలు రావి బాబూరావు, మల్లుపెద్ది బోసు, పాలడుగు రత్నబాబులు నాగేశ్వరరావు భౌతిక కాయంపై ప్రజనాట్య మండలి, సీపీ ఐ జెండాలను కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. మల్లుపెద్ది లెనిన్, అల్లూరి బాబూరావు, పూసపాటి బ్రహ్మానందరావు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కేసనకుర్తి శరత్ బాబు, కావూరి పరమేశ్వరరావు, విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు బెజవాడ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ క్రీడాకారులు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : డిసెంబర్ 11 నుంచి 22 వరకు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు బెజవాడ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ క్రీడాకారులు ఎంపికైనట్లు బెజవాడ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ క్రీడాకారులు ప్రధాన కార్యదర్శి బచ్చు మురళీకృష్ణ తెలిపారు.

అక్టోబరు 27 నుంచి 31 వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచడం ద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయారన్నారు. బచ్చు వరుణ్ కృష్ణ (డౌన్ హిల్ సీనియర్ విభాగం), జి.ప్రణవరెడ్డి (స్పీడ్ సబ్ జూనియర్స్ విభాగం), కె శాన్వి రఫియా (స్పీడ్ 9-11 విభాగం), ఎన్ .నిహారిక (స్పీడ్ ఇన్ లైన్ 9 -11 విభాగం, బి.జతిన్ (స్పీడ్ ఇన్ లైన్ 7-9 విభాగం), సిహెచ్.అభిరామ్ (రోలర్ ఫ్రీ స్టైల్ విభాగం) , డి.సమర్ కుమార్ (రోలర్ స్కూటర్ విభాగం), శివ సాయి (రోలర్ స్కూటర్ విభాగం) ఎంపికయ్యారని తెలిపారు.

ఎంపికయిన క్రీడాకారులను కోచ్‌లు ఎమ్.దిలీప్, బచ్చు వరున్‌కృష్ణలను జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ డి.దుర్గాప్రసాద్, అధ్యక్షులు జె.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి బచ్చు మురళీకృష్ణ క్రీడాకారులను అభినందించి జాతీయస్థాయిలో మంచి మెడల్స్ సాధించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.

15 నుంచి రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల ఆట్యా పాట్యా చాంపియన్‌షిప్‌ను ఈ నెల 15, 16 తేదీలలో విజయవాడ రైల్వేస్టేడియం వేదికగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆట్యాపాట్యా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంభాదుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి 28 వరకు హర్యానాలో జరుగనున్న 28వ జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం అబ్జర్వర్ భూధోటి శివరామ్(9393575526)ను సంప్రదించాలన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీర్పుపై పునఃసమీక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు చెల్లుబాటు అవుతాయంటూ సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులు ఇచ్చిన తీర్పుపై 11 మందితో ఉన్న రాజ్యాంగ ధర్మాసనం మాత్రమే విచారణ చేయవలసి ఉందని వెంటనే పునః సమీక్షించి తీర్పు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డిమాండు చేశారు.

ఆదివారం నగరానికి విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్ స్వాగం పలికారు. నగరానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అగ్ర కులాల్లోని పేదలకు ఆర్థిక పరమైన స్కీములు పెట్టి అభివృద్ధి చేయాలి తప్ప విద్య,ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదని,ఆర్థిక అభివృద్ధి పథకం అంతకంటే కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి కులానికి తమతమ జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, అధికార పదవులలో వాటా ఇవ్వాలని కోరారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకే విరుద్ధమని ఇది రాజ్యాంగ పరంగా చెల్లుబాటు కాదని పేర్కొన్నారు.

15% జనాభా ఉండి 80% పదవులు పొందుతున్న ఓ.సి.లకు రిజర్వేషన్లు అవసరమా అని ప్రశ్నించారు. దేశ సంపదలో 90% అగ్రకులాలదే. విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ విచారణ చేయాలన్నారు.దానికోసం తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువరు బిసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెడనలో ఉద్రిక్తత : జర్నలిస్టులపై మహిళల దౌర్జన్యం

విశాలాంధ్ర- పెడన : కొంతమంది మహిళలు పాత్రికేయులతో దౌర్జన్యానికి దిగిన ఘటన ఆదివారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెడన నియోజకవర్గ జనసేన నాయకుడు యడ్లపల్లి రామ్ సుధీర్ ఆదివారం పెడన మున్సిపల్ కార్యాలయం ఎదురుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పాత్రికేయుల సమావేశంఏర్పాటు చేసినట్లు పెడన పాత్రికేయులకు సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న పాత్రికేయులు ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో పాత్రికేయుల సమావేశం జరిగే ప్రాంతానికి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్నటువంటి కొంతమంది మహిళలు ఈ ప్రాంతానికి ఆటోలలో వచ్చి పాత్రికేయులతో దౌర్జన్యానికి దిగారు. మీడియా ప్రతినిధులు మహిళలతో మేము మీడియా కవరేజ్ కి వచ్చామని చెబుతున్నా వినకుండా పాత్రికేయులపై విరుచుకుపడి జై జగన్ జై జగన్ అంటూ నినాదాలు చేశారు. మీ సమస్య ఏమిటి మీరు ఎవరిని ప్రశ్నిస్తున్నారు అని మీడియా ప్రతినిధులు అనగా ఆ విషయాన్ని పక్కన పెట్టి ఇష్టం వచ్చినట్లు నానా దుర్భాషలాడారు. దీంతో సహనం కోల్పోయిన పాత్రికేయులు పెడన పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్సై రవిచంద్ర కుమార్‌కు ఆ మహిళలపై ఫిర్యాదు చేశారు.

వన సమారాధనలతో సందడిగా గ్రామాలు

విశాలాంధ్ర-కూచిపూడి :మొవ్వ మండలంలో పలు గ్రామాలు ఆదివారం కార్తీక వన సమారాధనలతో సందడిగా మారాయి. ఒకవైపు పెద్దల పూజలు, మరొకవైపు పిల్లల ఆటపాటలతో ఆనంద వాతావరణం నెలకొంది. కూచిపూడిలో పెదసనగల్లు రోడ్డులోని భృగు మహర్షి వనంలో శ్రీ పద్మావతి సమేత భావన ఋషి పద్మశాలీయ బహుత్తమ సంఘం పర్యవేక్షణలో 27వ కార్తీక వన సమారాధనవేడుకలు అంబరాన్ని తాకాయి. ఈ సందర్భంగా కార్యవర్గ సంఘాన్ని కూడా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా వైఎస్ఆర్సిపి నేత కొండవీటి అమరబాలేశ్వరావు, సిపిఐ మండల కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావుల పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలలో కాటూరి శ్రీకాంత్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, కార్యదర్శిగా ఆకురాతి సాంబశివరావు, ఉపాధ్యక్షునిగాతుమ్మా శివ నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా తుమ్మలచెర్ల శేషు కుమార్, కోశాధికారిగా మునగాల వెంకట దుర్గారావు లో ఎన్నికయ్యారు, సభ్యులుగా చెరుకు రాజు, చెరుకు సుబ్బారావు, చెరుకు బాలసుబ్రహ్మణ్యంలు ఎన్నికయ్యారు.ఇదిలా ఉండగా మొవ్వ మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మొవ్వ రోడ్డులోని సీతామహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో కార్తీక వన సమారాధన నిర్వహించారు. మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కొమరవోలు రాము, మార్తి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గం లోని పలు గ్రామాల నుంచి ఆ సామాజిక వర్గీయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆటలు, దంపతుల పూజలతో ఆ ప్రాంతం హుషారుగా మారింది. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.